# ఇంటర్వ్యూ

## ఇచ్ఛాపురపు రామచంద్రం

అడ్వర్టయిజుమెంట్ చూశాడు రావ్.

ఆత్రుతగా ఆ మూలాగ్రమూ చదివాడు.

పట్నంలోని ఒక పెద్ద కంపెనీ-బెనర్జీ ఆటోమొబైల్స్-అసిస్టెంట్ యింజినీర్ పోస్టుకి దరఖాస్తుల నాహ్వానిస్తూంది. చాలా పేరుప్రఖ్యాతులున్న పెద్ద కంపెనీ అది.

అర్హతలూ వయో పరిమితీ సరిపోయాయి. అదృష్టవశాత్తూ-పూర్వానుభవం కోరలేదు. కనుక-తను ప్రయత్నించవచ్చు.

30 ఏళ్లక్రితం-ఆటోమొబైల్ యింజనీరింగ్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు రావ్. డిస్టింక్షన్‌లో వచ్చాడు. ఈ రెండుసంవత్సరాలనుంచీ నిరుద్యోగిగానే ఉండిపోయాడు. చిన్నచిన్న పోస్టులలో చేరడం నాకిష్టంలేదు. ఉద్యోగం అంటూ చేపడితే అందులో కూరుకుపోవడమే ఔతుంది. ఇతర అవకాశాల కోసం ప్రయత్నించేందుకు తగిన సమయమూ ఓపికా ఉండవు. కనుక మొదటే మంచి ఉద్యోగంలో చేరాలి. ఇది రావ్ ఉద్దేశం.

ఉద్యోగంగురించి కచ్చితమైన అభిప్రాయాలు కొన్ని ఉన్నాయి రావ్‌కి. ముందుకుపోయే అవకాశాల నిచ్చేదిగా ఉండాలి పోస్టు. లేకపోతే జీవితానికీ చదువుకీ సార్థకత ఉండదు. ఎక్కడ వేసినగొంగళి అక్కడే ఉంటే - రావ్‌కి చిరాకు. పరుగెత్తేతత్వం అతనిది.

ప్రస్తుతం దేశాన్ని పీడిస్తున్న నిరుద్యోగసమస్య గురించి రావుకి తెలియకపోలేదు. ముఖ్యంగా- యింజనీరింగ్ సైడు ఎంత నిరాశాజనకంగా ఉందో అతనికి ప్రత్యక్షానుభవమే. తనతో బి. యి. ఫస్ట్‌క్లాసులో వచ్చిన మాధవ్ - మరోగతి లేక హైస్కూలుల్లో మేథమటిక్స్ అసి

స్టైంటుగా చేరాడు; అవేళ రావ్‌కి యీ దేశంమీద చాలా కోపమూ-ఇంజనీరింగ్ మీద ఎంతో జాలీ కలిగాయి.

బెనర్జీ అండ్ బెనర్జీ ఆటోమొబైల్స్ ఆఫర్ చేస్తున్న పోస్టులో పైకి పోయేందుకు చక్కని అవకాశాలున్నాయి. సాంకేతిక పరిజ్ఞానానికి మెరుగులు దిద్దగలిగే ఉద్యోగం. జీతమూ తదితరసదుపాయాలూ ఆకర్షణీయంగానే ఉన్నాయి. ఈ జాబ్ దక్కించుకోగలిగితే అదృష్టమే. ఇన్నాళ్ళ తననిరీక్షణకు చక్కని ఫలం అందుతుంది. ఏమయినా సరే యీ పోస్టు దక్కించుకోవాలి. అవకాశం జారవిడుచుకో కూడదు.

అప్లయ్ చేశాడు రావ్.

వారం తిరగకుండా ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. రెండు మూడు రోజులలో ఇంటర్వ్యూ.

ముకుంద్‌ని కలుసుకోడం మంచిదనిపించింది. ముకుంద్ రావ్ స్నేహితుడు. అతను బెనర్జీ అండ్ బెనర్జీ ఆటోమొబైల్స్‌లో పనిచేస్తున్నాడు.

"మై డియర్ ముకుంద్. మీ కంపెనీలో ఎ. యి. పోస్టుకి అప్లయి చేశాను. ఎల్లుండే ఇంటర్వ్యూ. నీ దగ్గర సలహా తీసుకోవాలని వచ్చాను-సబ్జక్టు బాగానే ప్రిపేరయ్యాను.

"గ్లాడ్! కాని..."

"కాని?..."

"హయ్యర్ పోస్టు ఫిలప్ చేసేటపుడు కంపెనీ ఒక విధానం అవలంబిస్తుంది. ప్రమోషన్ పాలసీ - మానేజిమెంట్, యూనియన్ల అంగీకారంప్రకారం ఏర్పడింది. వేకెన్సీలకి 'రా' క్యాండిడేట్లతోపాటు కంపెనీలో పనిచేస్తూ ఎలిజిబిలిటీ ఉన్న క్యాండిడేట్లని కూడా పిలుస్తారు. ఇంటర్వ్యూ ప్రాక్టికల్ గ్రౌండ్స్ మీద జరుగుతుంది-కనుక 'రా' క్యాండిడేట్స్‌కి సెలక్షన్ రావడంకష్టం. ప్రాక్టికల్ నాలెడ్జీ ఎక్స్పీరియన్సూ ఎక్కువ ఫెచ్ చేస్తాయి.

"ఆ మాత్రం దానికి డైరక్టు క్యాండిడేట్స్‌ని పిలవడమెందుకు?"


"కన్నీటి తుడుపు అంతే. పబ్లిక్ యిమేజిని కాపాడుకుందుకు కంపెనీ ఇలాటి నాటకాలాడుతుంది. రావ్! నిన్ను నిరుత్సాహపరచాలనికాదు కాని-నీమేలు కోరి మరొకనిజం చెప్పదలచుకున్నాను."

"ఏమిటి?"

"జూనియర్ యింజినీర్ రఘురామ్ అంటే ఛీఫ్‌కి చాలా ఫేవర్. నిజం చెప్పాలంటే-ఛీఫ్ అతన్నెలాగయినా ప్రమోట్ చెయ్యాలని ఉన్నాడు-కంపెనీ సీక్రెట్ యిది..."

"అయితే యింటర్వ్యూకి అటెండవడం అనవసరమే అంటావా?" నీరసంగా అడిగాడు రావ్.

"ఊహూఁ చెప్పలేం. నువ్వు తెలివైనవాడివి. నీ అదృష్టం ఎలావుందో? ప్రయత్నించి చూడవలసిందే. ఒకటి మాత్రం గుర్తుపెట్టుకో. ఇంటర్వ్యూకి కావలసింది



సబ్జక్టు కాదు. సమయస్ఫూర్తి. ఐ మీన్ ప్రెజన్సాఫ్ మైండ్. చాలా స్మార్ట్‌గా ఉండాలి. ప్లీజ్ ట్రై యువర్ లక్."

"థాంక్యూ..చాలా చెప్పావు."

రావుకి కోపంగా ఉంది. క్వాలి ఫికేషన్స్‌కి అట్టే ప్రాముఖ్యత ఉండదనే సరికి నిరుత్సాహం ఆవరించింది. ఉద్యోగం దూరమైపోయినట్లే అనిపించింది. అయినా ఆశని పుంజుకుని పోటీలోగెలవడానికి సర్వసన్నాహాలూ చేసుకోదలిచాడు. ముకుంద్‌ని కలుసుకోడం వలన ముఖ్యమయిన విషయాలు తెలుసుకోగలిగినట్లనిపించింది. కృతజ్ఞతలు తెలిపి ముకుంద్ వద్ద శలవు తీసుకున్నాడు.

* * *

స్వింగ్ డోర్స్ తెరచుకున్నాయి.

రావ్ లోపలికి నడిచాడు.

అక్కడ_చీఫ్ ఉన్నాడు కుర్చీలో.

"గుడ్ మార్నింగ్ సర్.."

"మార్నింగ్. మీరు.."

"మిష్టర్ రావ్."

"గుడ్! కూర్చొండి."

"థాంక్యూ వెరీమచ్_"కూర్చున్నాడు రావ్.

"సర్టిఫికేట్స్ ప్లీజ్"

రావ్ అందించాడు.

మార్కుల షీటు చూసి-"కంగ్రాట్స్ చాలా బ్రిలియంట్ మార్క్స్ తెచ్చుకున్నారు-" అన్నాడు ఛీఫ్ మందహాసంతో.

''థాంక్స్ ఫర్ ద కాంప్లిమెంట్స్."

"మా కంపెనీ ప్రమోషన్ పాలసీ కొంచెం తెలుసుకోండి. క్వాలిఫికేషన్‌తో పాటుఎక్స్పీరియన్స్‌కి కూడాప్రాముఖ్యత యివ్వబడుతుంది. అందుచేతరా- క్యాండేట్లతోపాటు కంపెనీలో వర్క్ చేస్తున్న ఎలిజిబుల్ క్యాండిడేట్లను కూడా ఇంటర్వ్యూ చేసి-సెలక్టుచేయడంజరుగుతుంది"

తలపంకించాడు రావ్.

''రఘురామ్-జూనియర్ యింజినీర్. అతను మీ ప్రత్యర్థి-"

అదే క్షణంలో రఘురామ్ వచ్చాడు.

ఇద్దర్నీ పరిచయం చేసాడు ఛీఫ్.

ప్యూన్ కాఫీలు తెచ్చాడు.

ముగ్గురూ తీసుకున్నారు.

"లెటస్ ప్రొసీడ్-" అని లేచాడు ఛీఫ్.

కాంపౌండ్‌లోకి వచ్చారు ముగ్గురూ.

అక్కడ ఇంపాలా, ఓల్డ్స్ మొబయిలూ ఉన్నాయి.

ఛీఫ్ రావ్ చెయ్యిపట్టుకుని ఓల్డ్స్ మొబాయిల్ వైపు నడిచాడు. రావ్ కూర్చున్నాడు. ఓల్డ్సు మొబాయిల్ స్టార్ట యింది.

వెనుక - యింపాలాలో రఘురామ్ అనుసరిస్తున్నాడు.

రావ్‌కి చిత్రంగా ఉంది.

ఏమిటీ యింటర్వ్యూ? ఒక్క ప్రశ్న అయినా అడగలేదు. సబ్జక్టు మీద! ఇది యింటర్వ్యూ? లేక ప్లెషర్ ట్రిప్పా?

ఊరు దాటి చిన్నగుట్ట ఎక్కుతుంది కారు.

"హౌడుయు లైక్ ద సీనరీ?'' అడిగాడు ఛీఫ్.

"వెరీనైస్-"

తోవ కటూ యిటూ చక్కని చెట్లు. దూరంగా కొండలు. మలుపులు తిరుగుతూ పైకి పోతున్న రోడ్డు. నిజంగానే అక్కడ అందంగా ఉంది ప్రకృతి.

ఫస్టుగేర్‌లో నడుపుతున్నాడు ఛీఫ్.

హఠాత్తుగా కారు ఆగిపోయింది.

చిరాగ్గా చూసి కారు దిగాడు ఛీఫ్.

''ప్లీజ్ ట్రై మిస్టర్ రావ్.."


"యస్ సర్..."

డాష్ బోర్డులోంచి షెర్లాక్ హోమ్స్ పుస్తకం బయటకు తీశాడు ఛీఫ్. ఈలోగా రఘురామ్ అక్కడికి చేరాడు.

''కారు ట్రబులిచ్చింది - రావ్ సెట్ చేసి స్టార్ట్ చేస్తాడు. అరగంట చాలు కదూ మిస్టర్ రావ్?''

''యస్-" అన్నాడు రావ్.

ఛీఫ్ షెర్లాక్ హోమ్స్ పట్టుకుని దూరంగా నడిచి ఓ చెట్టునీడలో నిలబడి పుస్తకం చదవసాగాడు.




రఘురామ్ మరోవైపు నడిచాడు.

రావ్ డిక్కీ తెరచి టూల్‌కిట్ అందుకున్నాడు.

చకచకగేర్ బాక్స్ తెరిచాడు. డిఫెక్టు కనబడలేదు. బానెట్ ఎత్తి బ్యాటరీ కనెక్షన్లూ, రేడియేటరు వగైరాలన్నీ చెక్ చేశాడు. ఎక్కడా ఏ లోపమూ కనిపించలేదు.

కారు స్టార్టుచేసి చూశాడు.

స్టార్టు కాలేదు!

అతని ఆతృత అధికమైంది.

చదివిన ఛాప్టర్లు గుర్తుకి తెచ్చుకుంటున్నాడు.

ఆటోమాటిక్ బ్రేక్‌డౌన్, మెకానికల్ బ్రేక్‌డౌన్ ప్రకరణాలు మెదడులోతిరుగుతున్నాయి.

అతనికర్థం ఐపోయింది.

ఇదే యింటర్వ్యూ. తను ఫెయిలయితే ఉద్యోగానికి నీళ్ళు వొదులుకోవలసిందే.

వాచీ చూశాడు.

ఐదు నిమిషాలు మాత్రమే ఉంది వ్యవధి.

ఉద్యోగం లభించడానికీ, లభించకపోవడానికీ—ఐదు నిముషాలు! ఈ ఐదు నిముషాలూ తన భవిష్యత్తుని నిర్ణయిస్తాయి.

ఛీఫ్ వైపు చూశాడు.

షెర్లాక్ హోమ్స్ చదువుకుంటున్నాడతను. అట్టమీద బొమ్మ అస్పష్టంగా కనిపిస్తోంది.

రఘురామ్ వైపు చూశాడు. ఇంపాలాకి దూరంగా నిలుచుని నవ్వు ముఖముతో తనని పరిశీలిస్తున్నాడు. ఎంత ధీమా! ఎదుర్కోబోయే యింటర్వ్యూ

పట్ల అతను ఆత్రతత పడటంలేదు. కొంచెం కూడా నెర్వస్ కావడంలేదు.

మెరపులాటి ఆలోచన మెదిలింది రావ్ మెదడులో.

త్వర త్వరగా బాయ్‌నెట్ ఎత్తాడు. కొన్ని క్షణాలు గడిచాక గేర్‌బాక్స్ కదిపాడు.

ఐదు నిముషాల వ్యవధి యిట్టే అయిపోయింది.

"యువర్ టైమీజ్ ఓవర్!-" అంటూ వచ్చాడు చీఫ్. రఘురాం కూడావచ్చాడు.

కారు స్టార్టవలేదు.

"సారీ మిస్టర్ రావ్-" చీఫ్ రఘురామ్‌వైపు తిరిగాడు.

"మిస్టర్ రఘురామ్..నీకు పావుగంట మాత్రమే వ్యవధి. డైరెక్ట్ క్యాండిడేట్‌కి కొంత ప్రివిలేజ్ యివ్వడం న్యాయం. అందుకే రావ్‌కి అరగంట యిచ్చాను. నువ్వు అనుభవం కలవాడివి కనుక... పావుగంట మాత్రమే. బి క్విక్..."

మందహాసం చిందిస్తూ టూల్ కిట్ అందుకున్నాడు రఘురామ్. చీఫ్ రావు భుజం మీద చెయ్యివేశాడు.

"డోన్ట్ మైండిట్ మైడియర్ యంగ్ మాన్!...నీ బ్రిలియంట్ మార్క్స్ నన్ను చాలా యింప్రెస్ చేశాయి. రఘురామ్ ప్రమోట్ కావడంతో జూనియర్ ఇంజనీర్ పోస్టు వేకెంటవుతుంది..."

సజెస్టివ్‌గా చూశాడు చీఫ్.

రావ్ మందహాసం చిందించాడు. "క్షమించండి. రాజీపడటం నా తత్వం కాదు. అయినా యింకా యింటర్వ్యూ ఫలితం తేలనేలేదు.

ప్రశ్నార్థకంగా చూశాడు చీఫ్.

రావు మౌనంగా ఉండిపోయాడు.

రఘురామ్ టూల్‌కిట్ సర్ది-స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. చాలా ఆత్మవిశ్వాసంతో.

"వెల్! పదినిముషాలలోనే పూర్తి చేశావు. స్టార్ట్!-" అభినందిస్తున్నట్లన్నాడు చీఫ్.

చిరునవ్వుతో కారు స్టార్ట్ చేయబోయాడు రఘురామ్.

కారు స్టార్ట్ కాలేదు.

రఘురామ్ ముఖంలో కత్తివేటుకి నెత్తురుచుక్కలేదు.

చీఫ్ ముఖం పేలవం అయిపోయింది.

రఘురామ్ హడావిడిగా టూల్‌కిట్ అందుకుని గేర్‌బాక్స్ ఓపెన్‌చేశాడు. అది క్లోజ్ చేసేసరికి ఐదు నిముషాలు గడిచాయి. కాని కారు స్టార్ట్ కాలేదు.

చీఫ్ ముఖం రంగులు మారింది.

మెల్లగా అన్నాడు రావు-"సర్! మొదటి రౌండులో యిద్దరమూ ఓడిపోయాము. కనుక మమ్మల్ని మరొక ఛాన్స్ తీసుకోనివ్వండి. ఈ సారి ఐదు నిముషాలు చాలు."

"ఊఁ." విసుగ్గా అన్నాడు చీఫ్.

"మిస్టర్ రఘురామ్ మొదట మీరు ప్రయత్నిస్తారా? నన్ను ప్రయత్నించ మంటారా?''

"మీరే కానివ్వండి. అదే న్యాయం."

రావు చకచక టూల్ కిట్ అందుకుని బానెట్ ఎత్తి రెండు నిముషాలలో మళ్ళీ బానెట్ మూసి- "కమిన్ సార్. కారు కదిలి తీరుతుంది-'' అన్నాడు ధైర్యముగా.

నమ్మకంలేనట్లు నిలబడి పోయాడు చీఫ్.

కారు స్టార్ట్ చేశాడు రావు.

కారు కదిలింది.

తెల్లబోయాడు చీఫ్.

"నేను గెలిచినట్లేనా?'' అడిగాడు రావు.

"ఊఁ. సరేకాని...మొదట ఎందుకు ఓడిపోయావు? మళ్ళీ యింత తక్కువ వ్యవధిలో ఎలా స్టార్ట్ చేయగలిగావు?" ఆశ్చర్యంగా అడిగాడు చీఫ్.

"ముందు షెర్లాక్ హోమ్స్‌కి నాకృతజ్ఞతలు తెలియజేసుకోవాలి. నా విజయానికి కారణం కానన్ డయల్." కొంచం ఆగి అన్నాడు రావు. టిట్ ఫర్ టాట్ మీరు నామీద ప్లే చేసిన ట్రిక్కే ప్రయోగించాను-''

"ఏమిటి నువ్వనేది?'' కోపంగా చూశాడు చీఫ్.

"నేనూ తెలివయిన వాడినే. గేర్ బాక్స్‌లో మీరు డిఫెక్టు ఏర్పరిచారు. ప్రి అరేంజ్‌డ్.. రఘురామ్‌కి అవి తెలుసు. నాకు తెలియదు. కాని నేను బ్యాటరీ కనెక్షన్స్ తీసివేశాను. అది రఘురామ్‌కి తెలియదు. ఓడిపోతూ నేను చేసిన పని అది. రఘురామ్ తన ప్రయత్నంలో గేర్ బాక్స్ సెట్ చేశాడు. అయినా నేను బ్యాటరీ కనెక్షన్స్ ఊడదీసి ఉంచడంతో కారు స్టార్ట్ కాలేదు.

రెండవ ప్రయత్నంలో నేను ఆ కనెక్షన్స్ సరిచేశాను. కారు స్టార్టయింది.

సర్!...మీ వర్కర్స్ పట్ల మీరు చాలా అభిమానంగా ప్రవర్తిస్తారన్న మాట!- మీ వంటి యజమానులవద్ద పని చేసే అవకాశం లభించడం చాలా అదృష్టమే-"

చీఫ్ మాట్లాడలేకపోయాడు - తేలు కుట్టిన దొంగలా. రెండు కారులూ కదిలాయి.

